

ఆలోచింపజేసే కథ

# ప్రయాణంలో పదనిసలు

గంటి భానుమతి

ఢిల్లీ వెళ్ళే ఏ.పి. ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాదు స్టేషన్‌లోని మొదటి ప్లాట్‌ఫారం మీద యింకా పూర్తిగా ఆగకుండానే, వికాస్ తన సామాను తీసుకుని రైలుతో పాటూ గబగబా నడుస్తూ బోగీని వెతుకుతున్నాడు.

రైలు ఆగాక, మనుషుల్ని తప్పించుకుంటూ బోగీలోకెళ్ళాడు. సీటు నంబరు చూసుకుని, భుజాన ఉన్న బాగుని పై బెర్త్‌మీద ఉంచి పెట్టెని కిందపెట్టడం కోసం వొంగాడు.

కానీ అప్పటికే అక్కడ ఎవరివో ఓ రెండు అట్టపెట్టెలు, ఓ ద్రాక్షపళ్ల బుట్ట ఉన్నాయి. ఎదురుగా ఉన్న సీటు కింద స్థలం ఉంది కానీ, అక్కడ ఓ రెండు కాళ్ళు అడ్డుగా ఉన్నాయి. తలెత్తాడు, ఆ కాళ్ళ సొంతదారు పేపరు చదువుతూండడంతో మొహం కనపళ్ళేదు. ఓ క్షణం ఆలోచించాడు.

"కొంచెం మీ కాళ్ళు పక్కకి జరిపితే, నా సామానిక్కడ పెట్టుకుంటాను" అని హిందీలో అన్నాడు.

చెప్పుల్ని ఓ పక్కకి విడిచి, కాళ్ళు రెండూ పైకి పెట్టుకుంది. ఆ తెల్లటి పాదాలు, ఆ మడమల పైకి ఉన్న లేతనీలం రంగు పువ్వులున్న తెల్లసల్వారు..ఎక్కడో చూసినట్లుగా, చాలా పరిచయం ఉన్న డ్రెస్‌గా అనిపించింది.

పెట్టెని తోసి, చేతిలో ఉన్న గొలుసు తాళం తీసి, అక్కడే ఉన్న ఇనపరాడ్‌కి బంధించి, అరచేత్తో ముక్కూ, పెదాలు, చెంపలూ, గడ్డం తుడుచుకుంటూ యధాలాపంగా ఎదుటి సీటు వైపు చూస్తూ, తన సీట్లో కూచున్నాడు వికాస్.

కలుగుతున్న ఇబ్బందికి, పేపరు ఓ పక్కకి తప్పించి, విసుగ్గా చూసింది ఎదురు సీట్లో ఉన్న ఆమె. వెను వెంటనే విసుగు స్థానంలో ఆశ్చర్యం చోటుచేసుకుంది.

ఆమెను చూసిన వికాస్ కూడా దాదాపు అదే స్థితిలో ఉన్నాడు.

"సమీర.." అప్రయత్నంగా పెదవులు కదిలాయి.

వెంటనే తేరుకున్న సమీర అయిష్టంగా మొహం తిప్పుకుని, పేపరు అడ్డుపెట్టుకుంది. మొహానికి అడ్డుపెట్టుకోవడానికి ఏదీ లేక వికాస్ చాలా యిబ్బందిగా తలని అటూ యిటూ తిప్పాడు. ఢిల్లీ చేరేవరకూ సమీర ఎదురుగా ఎలా కూచోడం? సీటు మార్చుకుంటే మంచిది. కిటికీలోంచి బయటికి చూసాడు.

ఓ చేత్తో పెన్నూ, మరో చేత్తో పాడ్, కాయితాలు పట్టుకుని, ఎవరితోనో మాట్లాడుతున్న టీసీ కనిపించాడు. మరుక్షణంలో అతని ముందు నుంచున్నాడు.

"నా సీటు మార్చండి ప్లీజ్" అన్నాడు. టీ.సీ. ఓసారి వికాస్‌ని చూసి, "వీళ్ళందరూ సీట్లకోసం ఇక్కడ నుంచున్నారు. సీటు కాన్సిల్ చెయ్యగలను కానీ, అక్కడా యిక్కడా మార్చి సర్దలేను. సారీ"

"ప్లీజ్" అంటూ ఓ వంద నోటు పెట్టాడు అతని చేతిలో.

"ప్రయత్నిస్తాను. మీ సీటు నంబరివ్వండి" అంటూ నోటు జేబులో పెట్టుకున్నాడు.

వికాస్ రైలు కదిలేవరకూ అక్కడే ఉండి, రైలు కదిలాక తన సీట్లో వచ్చి కూచున్నాడు. ఏసీ పనిచేస్తున్నా, చిరుచెమటలు పట్టాయి.

సమీర పేపరు అలాగే మొహానికి అడ్డుగా ఉంచడంతో కొంచెం ఊపిరి పీల్చుకుంటూ, ధైర్యంగా కంపార్టుమెంటుని చూసాడు. ఇద్దరు సర్దార్జీలు మరో యిద్దరు సర్దార్జీలు, పంజాబీలో ఇత్తే..ఉత్తె..కిత్తే..దీర్ఘాలు తీస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు. పర్వాలేదు. తెలుగువాళ్ళు లేరు అని అనుకున్నాడు.

మరో పావుగంటకి టీసీ వచ్చి, వంద కాయితం వికాస్‌కి యిస్తూ "సారీ..ఎక్కడా కుదరలేదు. మీరే ఈ పక్కో, ఆ పక్కో ఎవర్నైనా బతిమాలి అడ్జస్ట్ చేసుకోండి" అన్నాడు.

ఈ మాటలన్నీ సమీర వింది. తనుందని సీటు మార్చుకోవాలనుకుంటున్నాడు. నిజానికి ఆమెకు కూడా ముళ్ళమీద కూచున్నట్లుగానే ఉంది. ఎంతసేపు పేపరు చదువుతున్నట్లు నటిస్తుంది. పేపరు తీసి వికాస్‌ని చూడలేదు. ఇలా ఎంతసేపు? రేపొద్దున్న ఢిల్లీ చేరే వరకూ అయితే..దేవుడా, రక్షించు.

నాలుగు రోజుల్నుంచి పెద్దక్కయ్య కూతురి పెళ్ళి, కొడుకు ఒడుగు హడావుడిలో నిద్రలేకపోవడం, అలసట, ఒక్కసారి వికాస్‌ని చుట్టేస్తే గబగబా పై బెర్త్‌మీద కెళ్ళిపోయాడు. దుప్పటి కప్పుకుని కళ్ళు మూసుకున్నాడు.


వికాస్ పైకెళ్ళడం, పడుకోడం అన్నీ పేపరు పక్క నుంచి గమనించింది.

తనని చూడనట్లుగా నిర్లక్ష్యంగా పైకెళ్ళి పడుకోడం కొంచెం బాధ కలిగించింది. అయినా ఈ వికాస్ తనని చూస్తే ఎంత, చూడకపోతే ఎంత, ఈ పక్కనున్న సర్దార్జీల్లాగే అతను కూడా ఓ ప్రయాణీకుడు. అయినా మగవాడికి భావుకత తక్కువ. ఫీలింగ్స్ యింకా తక్కువ.

ఒకప్పుడు సమీర, వికాస్ ఒకే కంపెనీలో పనిచేసే ఉద్యోగస్తులు. కొన్ని రోజులు కొద్దిగా మాట్లాడుకున్నారు. చనువేర్పడ్డాక సినిమాలకి, షికార్లకి వెళ్లారు. గ్రీటింగ్స్, పూలగుత్తులు అందచేసుకున్నారు. పెద్దవాళ్ళకి చెప్పారు.

వికాస్‌ని సమీర యింట్లోవాళ్ళు అంగీకరించారు కానీ, సమీరని వికాస్ యింట్లో వాళ్ళు వెంటనే అంగీకరించలేదు. ఓ నెలరోజులు తర్వాత అంగీకరించారు, పెళ్ళయింది. కానీ సమీర ఆ యింట్లో ఉండలేకపోయింది. ఇంట్లోవాళ్ళతో అసలు మాట్లాడేది కాదు. తన గదిలోనే ఉండేది. అదిగో, అప్పటినుంచి స్పర్ధలు రావడం మొదలయింది. అభిప్రాయ భేదాలు, భేదాభిప్రాయాలు, 'మనం', 'మనది' పోయింది. నీది, నాది వచ్చింది. నీ డబ్బు నా డబ్బు, నీ వాళ్ళకి, నా వాళ్ళకి అనే పదాలు ఎక్కువయిపోయింది.

సమానత్వం కోరే ఆడదాన్ని మగవాడు భరించలేడు అని అర్థం అయింది. తన స్వాతంత్ర్యం పోయిన



ట్లుగా అనిపించింది సమీరకి. తన అస్తిత్వాన్ని కాపాడుకోడం ముఖ్యం అనిపించింది.

ఊహించుకున్న జీవితం తలకిందులుగా అయిపోతూంటే-ఎందుకు ఊరుకోవాలి, పోట్లాడాలి.

అంతే. ప్రేమించుకున్నప్పుడు కనపడని అవగుణాలు, పెళ్ళయ్యాక కనిపించడం మొదలయాయి.

ఆ ఇంట్లోని మనుషుల మధ్య యిమడలేక భిన్నతత్వాల రాపిడిలోంచి పుట్టుకొచ్చే సమస్యలు బుర్రని ఆక్రమించేసి, ఉక్కిరిబిక్కిరి చేసేస్తూంటే, పరిస్థితి యింకా జటిలం అయిపోతూంటే నిశ్శబ్దంగా మిగిలిపోయింది.

చిన్న చిన్న కలహాలు, అర్థం లేని కారణాలు దాంపత్య జీవితాన్ని బలహీన పరుస్తూంటే, తన ఒక్క దానివల్ల కూలిపోతున్న జీవితాన్ని నిలబెట్టడం కష్టం అనిపించింది. జీవితం గురించి ఎక్కువగా ఆలోచించి, అంతకన్నా ఎక్కువగా ఊహించి, ఇంకా ఎక్కువగా ఆశించి భంగపడిందనిపించింది ఆమెకు.

ఐ లవ్ యూ స్థానంలో ఐ హేట్ యు వచ్చేసింది. ఓ కప్పుకింద జీవించే వాళ్ళే బద్ధశత్రువులైపోయారు.

పెళ్ళి అనేది జీవితానికి తెరచాపలాగా ఉండాలి. కానీ మునిగే పడవ లాగా కాదు. అదే జరిగింది. దాదాపు పిచ్చి పట్టే స్థితి వచ్చేసి, విడాకులకి దారితీసింది.

ఆ తర్వాత తెచ్చిపెట్టుకున్న నిబ్బరంతో ఏం జరగనట్లుగా ఉండడానికే ప్రయత్నించినా కానీ, ఏదో లోపం. ఏదో ఓ కోణంలోంచి కనిపించడం మొదలైంది.

జీవితాన్ని విశ్లేషిస్తే తన తప్పులెన్ని ఉన్నాయో సమీరకి రాను రాను తెలిసింది. అహంకారం ఇద్దరిలోనూ వుంది. అదే పెళ్ళి పునాదిని లాగేసింది.

అన్నింటిని ఓ పక్కకి తోసి, నిర్వికారంగా జీవిస్తున్న సమయంలో మళ్ళీ వికాస్ కనిపించి అలజడిని సృష్టిస్తున్నాడు. వికాస్‌తో విడిపోయి నాలుగేళ్ళు అవుతోంది.

ఈ నాలుగేళ్ళలో వికాస్ గుర్తొచ్చిన సమయాలున్నాయి. గుండె బరువెక్కిన క్షణాలున్నాయి. గుండెని పిండేసే ఘటనలు ఎన్నో... అయితే మళ్లీ వికాస్‌ని చూస్తూ, కనీసం ఓ ఇరవయ్యారు గంటలు, ఇంత దగ్గరగా ఎదురెదురుగా కూచుని ప్రయాణం చెయ్యాల్సొస్తుందని ఊహించలేదు.

చిన్నగా నిట్టూర్చింది.

మధ్య సీట్లోని సర్దారిణీ పడుకుంటాననంటే తప్పనిసరిగా లేచి, పడుకోవాల్సి వచ్చింది. నిద్ర రాదని తెలుసు. అయినా కళ్ళు మూసుకుంది.

వికాస్‌కి మెలకువ వచ్చేసరికి మధ్యాహ్నం ఒంటి గంట దాటింది. బద్ధకంగా అలాగే కళ్ళు మూసుకుని ఉన్నాక, అప్పుడు హఠాత్తుగా గుర్తొచ్చింది. కింద సమీర ఉందని కొంచెం తలని వొంచి కిందకి

చూసాడు. సమీర పడుకుని ఉంది.

ఐదేళ్ళయింది పెళ్ళయి, నాలుగేళ్ళయింది విడిపోయి.

పెళ్ళయ్యాకా, భార్య అనే పదవిలోకి వచ్చాక, సమీరలో రావలసిన పరిపక్వత రాలేదు. ఇంకా పెళ్ళి కాని దానిలాగా ప్రవర్తిస్తూంటే కోపం రాదా!

నచ్చిన కూర చెయ్యమంటే కోపం. అమ్మతో, అక్కతో మాట్లాడితే కోపం. పుట్టినరోజుకి ఆలస్యంగా వస్తే కోపం. అన్నింటికీ కోపం సాధింపు. పైగా వాళ్ళమ్మతో గంటలు గంటలు మాట్లాడడం. అన్నింట్లో ఆవిడ జోక్యం.

ఒకే యింట్లో ఉన్నా ద్వీపాంతర వాసుల్లాగా ఉండిపోయారు. మాటలు పూర్తిగా తగ్గిపోయాయి. విడాకులు యివ్వాలని ఏ కోశానా లేదు. అనవసర వాదాలకి దిగి, మానసికంగా క్షోభపెట్టేస్తూంటే, విడాకులొక్కటే పరిష్కారం అన్నట్లుగా మాట్లాడుతూంటే విధిలేక, పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకోవాల్సి వచ్చింది.

తెచ్చుకున్నది తిన్నాక, మళ్లీ నిద్రపోయాడు. కింద బెర్తుల వాళ్ళు లేస్తేనే తను కింద కూచోవచ్చు. వాళ్ళందరూ పడుకుంటే, బలవంతంగా పైన ఉండిపోయాడు.

నాలుగు దాటాక, అందరూ కూచున్నారు. వికాస్ మొహం కడుక్కుని సమీర ఎదురుగా కూచున్నాడు. పొద్దున్న ఉన్నంత యిబ్బంది యిప్పుడు లేదు. మామూలుగానే ఉన్నాడు. టీ అమ్మేవాడొస్తే ఆమెకోటిచ్చి తనోటి తీసుకున్నాడు.

ఓ గంట వరకూ ఏం మాట్లాడుకోలేదు.

"మీ అమ్మ బావున్నారా?" ఏదో ఒకటి అడగాలన్నట్లుగా అడిగింది.

వికాస్ సమాధానం యివ్వకుండా కిటికీలోంచి చూస్తూండిపోయాడు. వెంటనే జవాబు రాకపోవడంతో ఆమె అహం దెబ్బతింది. ఎందుకు మాట్లాడించానా అని మథనపడింది.

"అమ్మపోయింది" తల తిప్పకుండానే అన్నాడు.

"అరె..నాకు తెలీదే..ఎలా పోయారూ..." ఆగిపోయింది తెలియడానికి అవకాశమే లేదన్న సంగతి గుర్తుకొచ్చి.

ఇద్దరూ గతంలోకి వెళ్ళిపోయారు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళుండిపోయారు. చాలాసేపు మాట్లాడుకోలేదు.

"పెళ్ళి చేసుకున్నావా?"

ఉలిక్కిపడి వికాస్‌ని చూసింది. వెంటనే కిటికీలోంచి చూస్తూ "లేదు" అంది.

"ఏం నీ తత్వానికి తగ్గవాళ్ళు దొరక లేదా!" అని అడుగుదామనుకున్నాడు. కానీ, ఆమె స్వవిషయం తనకెందుకని ఊరుకున్నాడు. ఆమె అహంకారం తనకు తెలియనిదా! ఏమయినా అనచ్చు. అహంకారం ఉన్నవాళ్ళకి దూరంగా ఉంటేనే మంచిది. లేకపోతే ఆ బాధ ఎలాంటిదో తనకి తెలుసు. భరించాడు. భరించలేని స్థితికొచ్చాక విడాకులు తీసుకున్నాడు.



"మరి..నువ్వు" ఈసారి తలతిప్పి వికాస్‌ని చూస్తూ.

"లేదు.." తల అడ్డంగా ఊపుతూ మెల్లగా అన్నారు.

ఇద్దరూ మాట్లాడుకోలేదు. వికాస్ మళ్ళీ బెర్త్‌మీదకి చేరాడు. ఓ గంటపోయాక కిందకి చూసాడు. కిటికీకి తల ఆనించి, కళ్ళు మూసుకుని ఉంది.

ఆమెను అలా చూస్తూంటే వికాస్‌కి సమీర మీద ఓ విధమైన జాలి కలిగింది. కాసేపటికి, ఆమెమీద ఉన్న కోపం పోయింది. గతించిన జీవితంలోని తీపి జ్ఞాపకాలు అడుగునుంచి పైకొచ్చాయి. ఆమెకోసం ఎదురు చూడడం, చిన్న చిన్న బహుమతులిచ్చుకోడం, బైక్ మీద షికార్లు, హోటళ్ళల్లో తినడాలు..యింకా ఎన్నో ఎన్నో..ఆలోచిస్తూంటే తమ విడాకులు ఆవేశంతో తీసుకున్నవి. ఇంపల్సివ్ డైవోర్సు..కిందకి దిగాడు.

ఆమె కళ్ళు తెరిచినప్పుడు అడిగాడు "ఎక్కడికెళ్తున్నావ్?" అని.

"ఢిల్లీ..నేను కంపెనీ మారాను. మా నాన్నగారు పోయారు. అన్నయ్య వదినకి నా మాట, నా పొడంటేనే గిట్టడం లేదు. నా జీవితంలోని ప్రతీ విషయంలో కలగ చేసుకున్న అమ్మ కూడా నాకు సపోర్ట్ యివ్వడం లేదు. ఒక్కోసారి అనిపించేది, అమ్మ నా జీవితాన్ని పాడుచేసిందా ఎక్కువ కలగచేసుకుని, అనవసరంగా జోక్యం చేసుకుని. నాన్న ఉంటే ఆ యింట్లో నా స్వతంత్రం వేరు. నాన్న లేకపోతే ఆ యిల్లు పరాయి యిల్లే. ఆ యింట్లో ఉండాలనిపించలేదు. అందుకే మరో ఉద్యోగం చూసుకున్నా. ఇందిరాపురం, షిప్రా మాల్ దగ్గరున్న కృష్ణా సొసైటీలో ఓ పంజాబీ వాళ్లింట్లో పేయింగ్ గెస్ట్‌గా ఉంటున్నాను"

ఆశ్చర్యంగా చూసాడు సమీరవైపు.

"నేను నోయిడా అరవయి రెండో సెక్టారులో ఉంటున్నాను. కానీ ఎప్పుడూ మనం ఒకళ్ళనొకళ్ళు చూసుకోలేదే..మరి

## కన్నడంలో అమీషా!

అమీషా పటేల్‌కి ఇప్పుడు హిందీలో అవకాశాలు అంతంతమాత్రంగానే అయిపోయాయి. దీంతో ఆమె తిరిగి తెలుగు, తమిళ రంగాల వైపు దృష్టి సారిస్తోంది. తెలుగులో మాటేమోగానీ కన్నడం నుంచి మాత్రం అవకాశాలు వస్తున్నాయి. తెలుగులో వచ్చిన 'అతనొక్కడే' సినిమాని కన్నడంలో తీస్తున్నారు. ఇందులో సింధు తులానీ పాత్రకిగాను అమీషాని నటింపచేస్తున్నారు నిర్మాతలు. ఇది అమీషాకి తొలి కన్నడ చిత్రం. ఇది హిట్టయితే కొత్త చాన్సులు వస్తాయని ఆశపడుతోంది అమీషా.

హైదరాబాద్ దేనికెళ్ళావ్?"

ఓ నిమిషం తటపటాయించింది చెప్పాలా! వద్దా!

"అమ్మ ఓ సంబంధం చూసింది..అందుకోసం..ఓ విధంగా పెళ్ళిచూపులకోసం అన్నమాట" నవ్వడానికి ప్రయత్నించింది కానీ, తేలిగ్గా నవ్వలేకపోయింది.

మొహం చిట్లించాడు.

"పెళ్ళిచూపులకా! అలాంటివి నీ తత్వానికి సరిపోదేమో..ఓ.కే. దాన్ని వదిలెయ్యి..ఇంతకీ ఏవయింది?"

భుజాలు, కళ్ళు ఎగరేసి, పెదవి విరిచింది. తల అడ్డంగా ఊపింది.

"ఎంత చదువుకున్న మగాడైనా మనసులో కన్సర్వేటివ్. విడాకులు తీసుకుంది అనగానే సంస్కారం ఎక్కడికో వెళ్ళిపోతుంది. ఓ విడాకులు తీసుకున్న స్త్రీకి పెళ్ళి అవుతోంది. అయితే ఎప్పుడూ? చాలా ఏళ్ళుగా ఒకే దగ్గర పనిచేస్తుంటేనో, ఒకే రంగంలో ఉంటేనో, ఒకరి భావాలు ఒకరికి నచ్చినప్పుడో, ఆ చాలాకాలం పరిచయంలో వితంతువు, విడాకులు అన్నది అర్థరహితంగా కనిపిస్తుంది. కానీ నా విషయంలో అలా జరగలేదు. మా యిద్దరికీ పెద్ద పరిచయం లేదు. పైగా నీతో విడిపోయాక యింకెవర్నీ భర్తగా చూడలేకపోతున్నాను"

సంభ్రమంగా సమీరని చూసాడు. సమీర కూడా వికాస్ కళ్ళల్లోకి చూసి చూపుమరల్చింది.

"మరి..నువ్వు" అంది వికాస్‌ని చూస్తూ.

ఒక్కసారి మొహంలో నీలినీడలు కమ్ముకున్నాయి.

"లేదు..ఎందుకో చేసుకోవాలనిపించలేదు. మరొకరిని భార్యగా ఊహించలేనని తెలుసుకోవడానికి చాలా కాలం పట్టింది" ఆ గొంతులోని జీర ఆమె గమనించింది.

ఆ తర్వాత యిద్దరూ మాట్లాడుకోలేదు.

భోపాల్ వచ్చేవరకూ అందరూ కూచున్నారు. ఆ తర్వాత ఒక్కొక్కళ్ళు పడుకోవడానికి ఉపక్రమించారు. వికాస్ పైకి వెళ్ళాడు.

పొద్దున్న ఎనిమిది వరకూ పైనుండి, ఆ తర్వాత కిందకి దిగాడు.

అప్పటికే సమీర నీట్‌గా తయారయ్యి ఉంది. కానీ తలని కిటికీకి ఆనించి కళ్ళు మూసుకుని ఉంది.

ఒక్కక్షణం ఆమె మీద కరుణ, అనురాగం లాంటి భావం కలిగింది. ఒక్కత్తే ఉంటుందా! ఇంట్లోవాళ్ళకి దూరంగా, పాపం.

వికాస్ కూడా ఫ్రెష్ అయ్యి, సామాను తీసుకుని దగ్గర పెట్టుకుని ఆమెని చూసాడు.

"నిజాముద్దీన్‌లోనే కదా దిగేది"

అవునన్నట్లుగా తల ఊపింది.

"నాకు టాక్సీ వస్తుంది. మరి నీకు?" ప్రశ్నార్థకంగా చూసాడు.

"దిగాకా ఏదో చూసుకోవాలి..టాక్సీలోనే వెళ్ళాలి"



"ఒకే చోటకి వెళ్తుంటే రెండు టాక్సీలెందుకు? రైట్?"

ఆమె ఏం మాట్లాడలేదు.

రైలు ఆగాక, ఎవరి సామానువారు తీసుకుని నిశ్శబ్దంగా బయటికొచ్చారు. సెల్ తీసి టాక్సీని పిలిచాడు. రెండు నిమిషాల్లో టాక్సీ వచ్చింది.

"నీకభ్యంతరం లేకపోతే..ఇందులో నువ్వు రావచ్చు. నిన్ను దింపేసి నేను వెళ్తాను" అంటూ తలుపు తీసాడు. సమీరని చూసాడు.

ఓసారి వికాస్‌ని చూసి, లోపల కూచుంది. ఆమె సామాను కూడా వెనక పెట్టించి ఆమె పక్కన కూచున్నాడు. ఒక్కసారిగా ఒళ్ళు జలదరించింది సమీరకి.

'మళ్ళీ కలిసి ఉంటే..' అన్న భావం యిద్దరిలో వచ్చింది.

"సమీరా! మనం విడిపోవడానికి కారణాలు చాలా చిన్నవి. సిల్లీ. టీ యివ్వలేదని, వంట బాగాలేదని, గిఫ్ట్ తేలేదని, సినిమాకి వెళ్ళలేదని, యిలా యిలా ఆ తర్వాత నేను బాధపడ్డాను. మనం చదువుకున్నాం కానీ, సంస్కారవంతంగా జీవించలేదని..ఇగో ప్రాబ్లెమ్స్ వేడెక్కిపోయిన మాటలు..మన యిద్దర్నీ విడదీసాయి. దీనివల్ల మనం యిద్దరం కూడా మానసికంగా చాలా నష్టపోయాం. ఒక్కరోజున మనిద్దరం కూచుని, సామరస్యంగా మాట్లాడుకుని ఉంటే ఈ స్థితి వచ్చేది కాదు. మనం పెళ్ళి చేసుకున్నది విడిపోవడానికి కాదు కానీ, అప్పుడు అలా ఆవేశంలో, ఉద్రేకంలో ఏదో అన్నీ అలా అలా జరిగిపోయాయి. ఇదివరకూ జరిగిన తప్పులు తిరిగి జరగకుండా, నా వైపు నుంచి నేను చూసుకుంటాను. నువ్వు కూడా అలా చేయగలిగితే..." అర్థాంతరంగా ఆగిపోయాడు.

ఆమె నుంచి ఏ సమాధానం రాకపోతే...ఆమె మొహంలోని భావాలు గమనించి ఆమె చేతిలో చేయివేసి, తన చెంపకి ఆనించాడు.

సమీర కళ్ళు మూసుకుంది. ఆ తర్వాత వాళ్ళిద్దరూ కొన్ని రోజులు ప్రేమికులుగా గడిపి మళ్ళీ పెళ్ళిచేసుకున్నారు.

○

## ఐశ్వర్య ఐశ్వర్యే!

ఐశ్వర్యారాయ్ పెద్ద స్టార్ అనే సంగతి అందరికీ తెలుసు కదా! అలాంటి స్టార్ కూడా సాదాసీదా మనిషిలా తోటి నటికి సాయం చేసేసరికి ఒక్కసారిగా ఆశ్చర్యపోయారట 'రావణ్' సినిమా యూనిట్‌వాళ్ళు. ఆ సినిమాలో తనతోపాటు నటిస్తున్న ఓ జూనియర్ ఆర్టిస్టుకి కాస్ట్యూమ్స్ విషయంలో సమస్య తలెత్తేసరికి ఐశ్వర్య స్వయంగా కలగచేసుకుని ఆ నటికి తనే సహకరించి ప్రాబ్లెమ్ సాల్వ్ చేసిందిట. అంత పెద్ద తార వచ్చిన తనకి సాయంచేయడాన్ని ఈ చోటా తార అస్సలు నమ్మలేకపోతోందిట. ఐష్ తీరు అందరి మన్ననలూ అందుకుందిట.